నర్సంపేటలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


నర్సంపేట: పాఠశాల భవనానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దొంతి

నర్సంపేట/ నర్సంపేట రూరల్, నవంబర్ 18: పట్టణంలోని పలు డివిజన్లలో 14వ ఆర్థిక సంఘం నిధులతో పలు అభివృద్ధి పనులకు మంగళవారం ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ టీయూఎఫ్ఐడీసీ నిధుల్లో ఒక్కో డివిజన్‌లో రూ.1కోటీ 60లక్షల ప్రత్యేక నిధులు మంజూరయ్యాయని, వీటితో అంతర్గత రోడ్లు, డ్రెయినేజీ సమస్య, మంచినీటి సమస్యలను పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఆరో డివిజన్‌లో పాఠశాల భవనానికి భూమిపూజ చేశారు. కాగా, పట్టణంలోని సర్వాపురం 4వ వార్డులో అదనపు తరగతి గదుల నిర్మాణానికి ఎమ్మెల్యే దొంతి శంకుస్థాపన చేశారు. 4, 5, 6 వార్డుల్లోనూ 14వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేపట్టారు. మున్సిపల్ చైర్మన్ గుంటి రజిని, నర్సంపేట మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్, ఎంఈవో కొర్ర సారయ్య, పాఠశాల హెచ్ఎం రజిత, టీచర్లు సమ్మయ్య, స్వాతి, కౌన్సిలర్ శీలం రాంబాబు, నాయకులు తక్కళ్లపెల్లి రవీందర్‌రావు, తిరుపతి, సాంబయ్య, రాజేందర్ ఉన్నారు.

మృతుల కుటుంబాలకు 'చల్లా' పరామర్శ

గీసుగొండ: మృతుడి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి

గీసుగొండ/సంగెం, నవంబర్ 18: పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి సోమవారం మృతుల కుటుంబాలను పరామర్శించారు. గీసుకొండ మండలం ఆరెపల్లి, శాయంపేటకు చెందిన కోట్ర జైపాల్‌రెడ్డి, తాళ్లపల్లి లక్ష్మీనారాయణగౌడ్ పలు కారణాలతో మృతిచెందారు. సంగెం మండలం కృష్ణానగర్‌లో మేకల దూడయ్య, దుడ్డు కొమురయ్య ఇటీవల మృతి చెందగా కుటుంబాలను పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబాలకు అండగా ఉంటానని హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ గీసుగొండ మండల కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ పూండ్రు జైపాల్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, ముంత రాజయ్య, నిమ్మగడ్డ వెంకటేశ్వర్‌రావు, బీఆర్ఎస్ పార్టీ సంగెం మండల అధ్యక్షుడు పసునూరి సారంగపాణి, మాజీ జడ్పీటీసీ గూడ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దొనికెల మల్లయ్య, మాజీ సర్పంచ్ కొడారి మోహన్ ఉన్నారు.

తప్పిపోయిన బాలిక తల్లిదండ్రులకు అప్పగింత

మట్టేవాడ, నవంబర్ 18: నగరంలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో తప్పిపోయిన బాలిక పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. ఇస్లామియా గ్రౌండ్స్ ఎగ్జిబిషన్ సందర్శకు కాజీపేటకు చెందిన మహమ్మద్ బాషా, షబానాసుల్తానా దంపతులు, కూతురు సఫా పర్వీన్(2) ఆదివారం వచ్చారు. బాలిక సఫా పర్వీన్ తప్పిపోగా తల్లిదండ్రులు ఎంత వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో 100 డయల్‌కు బాలికకు సంబంధించిన సమాచారం రావడంతో వెంటనే స్పందించిన పోలీసులు బాలికను రెండు గంటల్లో గుర్తించారు. బాలిక సరిగా మాటలు రాక పోవడంతో ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో విధులు నిర్వర్తిస్తున్న కల్యాణ్‌కుమార్ అనే కానిస్టేబుల్ పాపతో మాట్లాడి సమాచారాన్ని సేకరించారు. పాప తల్లిదండ్రులకు అప్పగించడంతో సంతోషం వ్యక్తం చేశారు.

మార్కెట్‌లో కొనుగోలు కేంద్రం ప్రారంభం

కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్మన్ హరిశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు రంజిత్‌రెడ్డి

నెక్కొండ, నవంబర్ 18: స్థానిక వ్యవసాయ మార్కెట్ ఆవరణలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి సోమవారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ రైతులకు మద్దతు ధర చెల్లించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని, సన్న వడ్లకు క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తోందన్నారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, ఎస్సై మహేందర్, మార్కెట్ కార్యదర్శి కృష్ణమీనన్, మార్కెట్ కమిటీ డైరెక్టర్స్ రావుల మహిపాల్‌రెడ్డి, ఎండీ ఖలీల్, బొమ్మెరబోయిన రమేశ్, మండల సమాఖ్య అధ్యక్షులు మార్త లావణ్య, భాగ్యలక్ష్మి వీవో అధ్యక్షురాలు రాసమళ్ల శ్రీదేవి, వీవోఏల మండల అధ్యక్షుడు యాకాంబ్రం పాల్గొన్నారు.

NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED TELECALLERS
jobs Apply Now!
★URGENT REQUIREMENT for ICICI HDFC AXIS INDUSIND BANK'S DSA PERSONAL LOANS EXPERIENCE AND FRESHER FEMALE TELE-CALLERS SALARY+INCENTIVESJOB LOCATION: HANAMKONDA, CONT: +91 9398286149.
NTW-7705

RENT

★3 floors building for rent, each floor has 3600sqft Ground floor for parking place available, opp:ASM DEGREE & PG WOMENS COLLEGE,Fort Road Warangal
M: 9849987808/8309884828.
NTW-17373

WANTED HOSPITAL STAFF
★Operation Theater Boys, Medical Shop Assts. & Computer Operators/Administrators /Supervisors Required Cont: Guardian Hospital, Mulugu 'X' Road, Wgl. 12 to 2 pm
NTW-450

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం
NAMASTHE TELANGANA CLASSIFIEDS
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552
HANAMKONDA 9182777563 9182777961
WARANGAL 9182777556
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777557
JANGAON - 9182777565

'రిజర్వాయర్'ను ఉపసంహరించుకోవాలి

రంగాయచెరువు నిర్వాసిత రైతులు

తహసీల్దార్ రాజేశ్‌కు వినతిపత్రం అందజేస్తున్న రంగాయచెరువు నిర్వాసిత రైతులు

నల్లబెల్లి, నవంబర్ 18 : రంగాయచెరువు ప్రాజెక్ట్ ప్రతిపాదనను ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని నిర్వాసిత గ్రామాల రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత రైతులు సోమవారం స్థానిక తహసీల్దార్ రాజేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం రిజర్వాయర్ నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ నాయకుడు గూబ రాజు మాట్లాడుతూ 2009లో కాంగ్రెస్ ప్రభుత్వం మండలంలోని గోవిందాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న రంగాయచెరువుతోపాటు ఎర్రాయిచెరువులను అనుసంధానం చేస్తూ రూ.305కోట్ల నిధులతో రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టాలని సంకల్పించిందని తెలిపారు. ఈ రిజర్వాయర్ ప్రాజెక్ట్ నిర్మిస్తే గోవిందాపూర్, లైన్‌తండా, మూడుచెక్కలపల్లి, ఎర్రచెరువుతండా, బూల్యతండా, కొండాపూర్, మురళీనగర్, గణేశ్‌నగర్, ఆసరవెల్లి, లక్ష్మితండాతోపాటు 3,194 ఎకరాల వ్యవసాయ భూములు ముంపునకు గురవుతున్నందున బాధిత ప్రజలు, రైతులు రిజర్వాయర్‌ను వ్యతిరేకిస్తూ ఉద్యమాలు చేపట్టారని తెలిపారు. ఆతర్వాత అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలనలో అప్పటి ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ప్రజాభిప్రాయం మేరకు రిటైర్డ్ ఇంజినీర్లతో ప్రత్యేక సర్వే చేపట్టి గ్రామాలతోపాటు గుంట భూమి ముంపుకు గురి కాకుండా అదే రూ.305కోట్లతో రబ్బరింగ్ సిస్టమ్ ద్వారా రామప్ప నుంచి గోదావరి జలాలను రెండు పైపులైన్ల ద్వారా పాఖాలతోపాటు రంగాయచెరువు, మాదన్నపేట చెరువుల్లోకి తరలించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేశారని తెలిపారు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ రంగాయచెరువు ప్రాజెక్ట్ ప్రతిపాదనను లేవనెత్తడంపై మరోమారు ముంపు గ్రామాల ప్రజలందరూ ఆందోళనకు గురవుతున్నట్లు తెలిపారు. తాత ముత్తాతల నుంచి పోడు సాగు చేసుకుని జీవిస్తున్న తమకు బీఆర్ఎస్ ప్రభుత్వం పోడు పట్టాలు మంజూరు చేయడంతో పాటు కరెంట్ లైన్, బోర్లు వేసుకునేందుకు అనుమతులు వచ్చాయని పేర్కొన్నారు. ఇప్పుడిప్పుడే ఊపిరి పీల్చుకుంటున్న గిరిజన బంజారా, ఆదివాసీ రైతులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ముంపునకు గురి చేయాలనే కుట్ర చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఇకనైనా రంగాయచెరువు రిజర్వాయర్ ప్రాజెక్ట్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రిజర్వాయర్ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు పరికి రత్నం, పూల్‌సింగ్, గాదం రాజ్‌కుమార్, నూనావత్ రాజు, సపావట్ దేవూనాయక్, దామ సాంబయ్య, రవి, రమేశ్ పాల్గొన్నారు.

ఫోర్ట్‌రోడ్డులో సెంట్రల్ లైటింగ్ మరమ్మతులు

ఈద్గా జంక్షన్‌లో చేసిన మరమ్మతులు

సీఎం వస్తేనే పనులా?

కరీమాబాద్, నవంబర్ 18: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వరంగల్ పర్యటన ఉన్నందున మరమ్మతులు చేస్తుండడంపై పలువురు విమర్శించారు. ఈనెల 19న సీఎం రాక కోసం ఫోర్ట్‌రోడ్డులో అధికారులు పలుచోట్ల మరమ్మతులు చేశారు. ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరించాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు వస్తున్నప్పుడు మాత్రమే మరమ్మతులు చేపట్టడంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కార్తిక వనభోజనాల వేడుకల్లో ఎర్రబెల్లి

ఆర్య వైశ్య సంఘం సభ్యులతో మాజీ మంత్రి ఎర్రబెల్లి

పర్వతగిరి, నవంబర్ 18: కార్తిక మాసం సందర్భంగా ఆర్యవైశ్య సంఘం మహిళలు పర్వతాల శివాలయాన్ని దర్శించుకున్నారు. వాసవీమాతకు ప్రత్యేక పూజలు చేసి, ఇంటి నుంచి తెచ్చిన గౌరమ్మల సమీకరణ విజయవంతంగా పూర్తి చేశారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ దాన గుణం వైశ్య కుటుంబాల్లో అధికంగా ఉంటుందన్నారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు చిదురాల వేణుగోపాల్, దారం పూర్ణచందర్, దారం రామచందర్, దొడ్డ శ్రీనివాస్, దారం వెంకటేశ్వర్లు, చంద శ్రీనివాస్, రమేశ్, పూర్ణచందర్, సోమనాదం, లక్ష్మీనారాయణ, క్రిష్ణమూర్తి, చంద నరేష్, దుబ్బ రాజు, ఆర్యవైశ్య మహిళా మహిళలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సోమేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, రంగు కుమార్ పాల్గొన్నారు.

వర్గీకరణ చేసే వరకు ఉద్యోగ నియామకాలు ఆపాలి

ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

నల్లబెల్లి, నవంబర్ 18 : ఎస్సీ వర్గీకరణ చేసే వరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నియామకాలను నిలిపి వేయాలని దళితరత్న కళ్లెపెల్లి ప్రణదీప్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ధర్మయుద్ధ మహాసదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ అమలులోకి తేవాలని డిమాండ్ చేశారు. సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి వర్గీకరణ అమలు చేయాల్సి ఉండగా నేడు మాట మార్చి మాదిగ జాతికి అన్యాయం చేయాలని చూడడం సరికాదన్నారు. కమిటీలు. కమిషన్ల పేరుతో కాలయాపన చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. డిసెంబర్ 21న హైదరాబాద్‌లో మాదిగల ధర్మయుద్ధ ప్రదర్శనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఎంఎస్పీ జాతీయ నాయకులు వేల్పుల సూరి, మండల నాయకులు నత్తి వ్యామ్, అడ్డ రాజు, అశోక్, అరుణ్, సూరయ్య, బొట్ల నరేష్, పరికి కోర్నేల్ పాల్గొన్నారు.

పర్వతాల శివాలయ ట్రస్టుకు రూ.లక్ష విరాళం


మాజీ మంత్రి ఎర్రబెల్లికి రూ.లక్ష విరాళం అందజేస్తున్న శేఖర్

పర్వతగిరి, నవంబర్ 18: మండల కేంద్రంలోని పర్వతాల శివాలయం అభివృద్ధికి పర్వతగిరి వాస్తవ్యుడు గడుదాసు శేఖర్ రూ.లక్ష చెక్కును పర్వతాల శివాలయం ట్రస్టు చైర్మన్, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావుకు సోమవారం అందించారు. మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు స్వామి, చిదురాల వేణుగోపాల్, రంగు కుమార్, ఫర్టిలైజర్ కుమార్, చందా శ్రీనివాస్, పూర్ణచందర్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం మండల కన్వీనర్‌గా విజయ

పర్వతగిరి, నవంబర్ 18: తెలంగాణ ఉద్యమకారుల ఫోరం కళాకారుల విభాగం మండల కన్వీనర్‌గా బరిగెల విజయ నియమితులయ్యారు. తన నియామకానికి సహకరించిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు.

భగవద్గీతలను అందజేస్తున్న యోగా గురువు

మానవ నడవడికకు దిక్సూచి భగవద్గీత

వర్ధన్నపేట, నవంబర్ 18: మానవులు సమాజంలో ఏవిధంగా జీవించాలనే విషయాలను తెలిపేందుకు భగవద్గీత మహాగ్రంథం ఒక దిక్సూచి అని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం అందిస్తున్న భగవద్గీత గ్రంథాలను మండలంలోని ఇల్లందకు చెందిన ప్రముఖులకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవులు సన్మార్గంలో నడిచేందుకు శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో అనేక విషయాలను వివరించారని తెలిపారు. భగవద్గీతలోని 18 అధ్యాయాలు చదివితే మానవజన్మకు సార్థకత లభిస్తుందని చెప్పారు. పిల్లలతోనూ భగవద్గీత చదివించాలని సూచించారు. మాజీ సర్పంచ్‌లు ఆర్.కుమార్, పెంచాల కుమారస్వామి, మోడెం కుమారస్వామి, ఎండీ.చోటు, ఎద్దు సత్యనారాయణ, పోశాల వెంకన్న పాల్గొన్నారు.

కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం

మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న అధ్యాపకులు

నర్సంపేట, నవంబర్ 18: నర్సంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కళాశాలలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది సొంత ఖర్చులతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పెడుతున్నారు. సోమవారం ఈ కార్యక్రమాన్ని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. వచ్చే ఫిబ్రవరి వరకు అందించాలని నిర్ణయించారు. విద్యార్థుల హాజరుశాతం పెంచేందుకు, జేఈఈ, మెయిన్స్, ఎంసెట్, నీట్ వంటి ఎంట్రెన్స్‌లలో విద్యార్థులు సీట్లు సాధించడం, ఐపీఈలో ఎక్కువ మార్కులు సాధించేందుకు, కళాశాలలో విద్యార్థుల ఉత్తీర్ణత శాతం పెంచేందుకు మధ్యాహ్న భోజనం అందిస్తున్నారు. కళాశాలలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకు 3 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంపత్‌కుమార్ తెలిపారు.

కవి సమ్మేళనంలో పాల్గొన్న ఎంఈవో అశోక్‌కుమార్

గ్రంథాలయంలో క్విజ్ పోటీలు, కవి సమ్మేళనం

పోచమ్మమైదాన్, నవంబర్ 18: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా వరంగల్ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు క్విజ్ పోటీలు, కవులకు కవి సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. పలు పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు ఉత్సాహంగా క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. కవితల పోటీల్లో పాఠశాల, కళాశాల స్థాయి విద్యార్థులు పాల్గొని కవితలను వినిపించారు. ఓరుగల్లుకు చెందిన ప్రముఖ కవులు మస్నా వెంకటేశ్వర్లు, కొండా యాదగిరి, గుండు రవి, నాగరాజు, ఉమాదేవి, వందన పాల్గొని కవితలను వినిపించారు. న్యాయనిర్ణేతలుగా కొమ్మోజు శ్రీధర్, డాక్టర్ బీఎన్ స్వామి వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా గ్రంథాలయ సంస్థ ఇన్‌చార్జి సెక్రటరీ శశిజాదేవి, వరంగల్ ఎంఈవో గంప అశోక్‌కుమార్, లక్ష్మీపురం పాఠశాల హెచ్ఎం లక్ష్మయ్య పాల్గొన్నారు. లైబ్రేరియన్లు ఎం.చినబాబు, పద్మారావు పాల్గొనగా, వ్యాఖ్యాతగా డాక్టర్ రయ్యాల శ్రీధరాచార్యులు వ్యవహరించారు. మంగళవారం చివరి రోజు పోటీలు నిర్వహించనున్నారు. ఉదయం 10.30 గంటలకు కళాశాల, పాఠశాల విద్యార్థినిలకు రంగోళి (ముగ్గులు) పోటీలు, మధ్యాహ్నం 12 గంటలకు పాఠశాల విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. 20న బుధవారం మధ్యాహ్నం బహుమతి ప్రదానోత్సవం ఉంటుందని పేర్కొన్నారు.

గుబ్బెటితండాలో అగ్నిప్రమాదం

వర్ధన్నపేట, నవంబర్ 18: పట్టణ పరిధిలోని గుబ్బెటితండాలో మంటలు చెలరేగి ఓ ఇంట్లోని వస్తువులు కాలిపోయాయి. బాధిత కుటుంబ సభ్యుల కథ నం ప్రకారం.. తండాకు చెందిన బానోత్ బిక్కు, పద్మ దంపతులు సోమవారం ఉదయం వ్యవసాయ పనులకు వెళ్లారు. మధ్యాహ్నం ఇంట్లో నుంచి పొగలు వస్తుండడంతో స్థానికులు ఇంటి తలుపులు తీసి చూశారు. ఇంట్లోని వస్తువులు మంటల్లో కాలిపోతుండడంతో వెంటనే వస్తువులను బయటకు తీసుకువచ్చారు. అప్పటికే నిత్యావసర వస్తువులతోపాటుగా ఇంటి అవసరాల కోసం దాచిన రూ.10వేల నగదు కాలిపోయాయి. దీంతో బిక్కు కుటుంబ సభ్యులు బోరున విలపించారు. విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల ప్రమాదం జరిగినట్లు బాధితులు తెలిపారు.

కాటన్ మిల్లులో..

నెక్కొండ: మండల కేంద్రంలో సోమవారం రాత్రి (దుర్గా) చిన్నయి కాటన్ జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌పై కోతి దూకడంతో షార్ట్ సర్క్యూట్ జరిగి మంటలు చెలరేగాయి. దీంతో మిల్లులోని లోపలి మిషన్లు కాలిపోయాయి. వెంటనే స్పందించిన మిల్లు కార్మికులు మంటలను ఆర్పేయగా అగ్ని ప్రమాదం తప్పింది. స్వల్ప నష్టం జరగడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

ఎరువుల వాడకంపై రైతులకు అవగాహన

కాశీబుగ్గ, నవంబర్ 18: వ్యవసాయంలో రైతులకు ఎరువులవాడకంపై అవగాహన కల్పించడం అభినందనీయమని జిల్లా వ్యవసాయశాఖ అధికారి కే అనురాధ అన్నారు. సోమవారం పైడిపల్లిలోని వ్యవసాయ పరిశోధన కేంద్రం వద్ద స్పిక్ ఫర్టిలైజర్స్ కంపెనీ రైతులకు వ్యవసాయరంగంపై ఆధునిక మెలకువలు తెలిపే ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయంపై ప్రతి ఒక్కరూ దృష్టి పెట్టాలన్నారు. రైతులకు అవగాహన కల్పించేందుకు స్పిక్ ఫర్టిలైజర్స్ కంపెనీ వారు ప్రచారం రథం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. శాస్త్రవేత్తలు అవినాశ్, రవీందర్‌రెడ్డి, దయాకర్, నిర్వాహకులు రమణారెడ్డి, తిరుమల్‌రావు, పవన్‌రెడ్డి, ప్రశాంత్ పాల్గొన్నారు.

'అంబేద్కర్ అభయహస్తం'ను అమలు చేయాలి

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దుగ్గొండి, నవంబర్ 18: కాంగ్రెస్ ప్రభుత్వం గతంలో ఇచ్చిన హామీ మేరకు అంబేద్కర్ అభయహస్తం పేరుతో అర్హులైన దళిత కుటుంబాలకు రూ.12లక్షల చొప్పున అందించాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు క్లేమెంట్ డిమాండ్ చేశారు. సోమవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీల్లో ప్రభుత్వ పథకాల్లో దళితులకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఎమ్మార్పీఎస్ నర్సంపేట ఇన్‌చార్జి ఆకులపెల్లి ఉప్పలయ్య, దుగ్గొండి మండల అధ్యక్షులు నల్ల బాబురావు, గుండెల్ని రవి, పులి సాంబయ్య పాల్గొన్నారు.

ఘనంగా రుద్రాభిషేకాలు

నెక్కొండ, నవంబర్ 18: మండల కేంద్రంలోని శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో కార్తీక సోమవారం పురస్కరించుకొని భక్తులతో ఆలయం కిటకిటలాడింది. ఆలయ అర్చకులు బీవీఎన్ శాస్త్రి ఆధ్వర్యంలో రుద్రాభిషేకాలు నిర్వహించి తీర్థప్రసాద వితరణ చేశారు. శివార్చనలు, బిల్వార్చనలు సాగాయి. శివనామస్మరణతో ఆలయంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

మాట్లాడుతున్న తహసీల్దార్ ఫణికుమార్

చెన్నారావుపేట, నవంబర్ 18: మహిళలు ఆర్థికంగా, సామాజికంగా మార్గదర్శకంగా ఉండాలని తహసీల్దార్ ఫణికుమార్ అన్నారు. ఇందిరా మహిళా శక్తి ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ ఫణికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మహిళలు సామాజికంగా, సంఘటితంగా, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి విజయాలు సాధించాలన్నారు. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ గ్రామీణ అభివృద్ధిలో క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. ఎంపీఓ శ్రీధర్ రాజు, ఏఎస్సై లక్ష్మణమూర్తి, ఏపీఎం, సమైఖ్య అధ్యక్షురాలు హైమ పాల్గొన్నారు.

అధిక సాంద్రత సాగుతో అధిక లాభం

గీసుగొండ, నవంబర్ 18: అధిక సాంద్రత పత్తి పంట సాగుతో అధిక లాభం పొందవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం సేద్య విభాగం శాస్త్రవేత్త డాక్టర్ సౌమ్య అన్నారు. మండలంలోని అనంతారంలో అధిక సాంద్రత విధానంలో సాగుచేసిన పత్తి పంటను పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ అధిక సాంద్రత సాగు విధానంతో పంట ఒకేసారి చేతికి అందుతుందన్నారు. కూలీల ఖర్చు తగ్గి రైతుకు లాభసాటిగా ఉంటుందన్నారు. చీడ పురుగుల బెడద, గులాబీ రంగు పురుగుల నుంచి రక్షించుకోవచ్చని తెలిపారు. పంట ఒకేసారి చేతికి అందటంతో రెండో పంట సాగు చేసుకునేందుకు వీలుంటుందని చెప్పారు. ఏఓ హరిప్రసాద్‌బాబు, నూజివీడు విత్తన సేల్స్ మేనేజర్ మురళీమోహన్ పాల్గొన్నారు.

శిక్షణతో లాభాలను పొందాలి

రైతులతో వ్యవసాయ సహాయ సంచాలకులు మహమ్మద్ గౌస్‌హైదర్

కరీమాబాద్, నవంబర్ 18: రైతులు శిక్షణ కార్యక్రమాలతో లాభాలు పొందాలని జిల్లా వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు మహమ్మద్ గౌస్ హైదర్ అన్నారు. మామునూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో మేకల పెంపకం, యాజమాన్యంపై శిక్షణ ముగింపు కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మేకల పెంపకం విధానంతో లాభాలను పొందవచ్చన్నారు. ప్రభుత్వ పథకాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మేకలు, గొర్రెల పెంపకంతో అదనపు ఆదాయం వస్తుందన్నారు. శిక్షణ పొందిన రైతులకు సర్టిఫికెట్లు అందజేశారు. కేవీకే ప్రదాన శాస్త్రవేత్త డాక్టర్ రాజన్న, సిబ్బంది పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కుకు పీహెచ్‌సీ మంజూరు

గీసుగొండ, నవంబర్ 18: మండలంలోని శాయంపేట టెక్స్‌టైల్ పార్కులో భూనిర్వాసితుల కోసం ప్రభుత్వం కేటాయించిన ఇండ్ల స్థలాల్లో రెండు రోజుల క్రితం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తూ జీవో జారీ చేసింది. ఆ ప్రాంతంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి ప్రభుత్వం పరిపాలన అనుమతులు ఇస్తూ సోమవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యం, కుటుంబ సంక్షేమ శాఖ జీవో జారీ చేసింది.

ఉపన్యాస పోటీల్లో బహుమతులు

చెన్నారావుపేట, నవంబర్ 18: దీవెన ట్రస్ట్ ఆధ్వర్యంలో 'మత్తు పదార్థాల వినియోగం-అనర్థాలు' అంశంపై హైస్కూల్ విద్యార్థులకు నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో మండలంలోని ఉప్పరపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల